## 9. ఎనాది నాథనాయనారు

ఎనాది నాథనాయనారు గౌడ కులస్థుడు. చోళ సామ్రాజ్యంలో ఐనానూరులో జన్మించాడు. ఆవూరు అరిసోల్ నదీ ప్రవాహము ఒడ్డున కుంభకోణమునకు వాయువ్య దిశలో వుంది. చాలా సారవంతమైన ప్రదేశము.

ఎనాదినాథర్ అచంచల శివభక్తుడు. శివభక్తిలో మాయిపోరూల్ నాయనారును మించిపోయాడు. శివభక్తులనేకాదు శివయోగులనే కాదు, మనుజులు ఫాలమున విభూతిరేఖలు మూడు ధరించిన చాలు వారిని బహుదా గౌరవించేవాడు. అపరిమిత భక్తసేవాతత్పరుడు. అవసరమైతే వారికొఱకు తన ప్రాణాలనైనా త్యజించుటకు సిద్ధపడే వాడు. త్యజించాడుకూడా.

కత్తిసాములో ఎనాదినాథర్ సుప్రసిద్ధుడు. రాజకుమారులను ఖడ్గవిద్యలో ప్రవీణులుగా నొనరించేవాడు. ఈ విద్యకు గురువైనందుకు ఆదాయము కూడా వచ్చేది. ఆవచ్చి నదంతా శివభక్తుల సేవకై వెచ్చించేవాడు.ఈ విద్యలో అందరిచేత ప్రశంసలందుకొన్నాడు.

ఇది కొందరిలో ఈర్ష్య, ద్వేషము, అసూయలను రేకెత్తించింది.

అట్లా అసూయ, ద్వేషము పెంచుకున్న వారిలో అతిసూరన్ అనేవాడు ఒకడు. ఎనాదినాథర్ మీద కార్పణ్యము పెంచుకొన్నాడు. అతనికి ఖడ్గ విద్య అంతగారాదు. పేరుకు (అతిసూరన్ - మహాశూరుడు) తగడు. అంత శరీర దార్ఢ్యము కూడా లేదు. ఏనాది నాథర్‌తో పోరి జయించాలనుకున్నాడు.

ఒకరోజున తన మనుష్యులు, బంధువులతో నాయనారు ఇంటిపై దండెత్తి, ఇంటి ముందు నిలబడి పోరుకు రమ్మని పిలిచాడు. నాయనారు పోటికి సిద్ధపడ్డాడు. అక్కడ నున్న పొద దగ్గర పోరాడుదాము, అక్కడికి రమ్మన్నాడు నాయనారును. అతిసూరన్ బంధువులంతా ఆ పొద చాటున దాగున్నారు. నాయనారు పొదదగ్గఱ పోటీకి సిద్ధమైనాడు. ఈలోగా నాయనారు స్నేహితులు వచ్చి అతనికి రక్షణగా నిలిచారు. ఉభయులకు పెద్దపోరాటమే జరిగింది. చాలామంది నిహతులయ్యారు. అతిసూరన్ పారిపోయాడు.

మఱునాడు అతిసూరన్ మఱల సందేశమంపాడు. "ఇతరుల సాయము లేకుం

డా పోరాడుదాము. మనమూలాన్న ఇతరులు హతులవుతున్నారు. అందుకని ఒక ఏకాంత ప్రదేశమున మన మిద్దరమే బలాబలాలు తేల్చుకుందాము" అని కబురంపాడు.

ఎనాదినాథర్ ఒప్పుకున్నాడు. మఱునాడు ప్రొద్దున్నే అతిసూరన్ తన ఫాలం మీద 3 విభూతిరేఖలుంచుకుని, అవి కనబడకుండా కవచము నడ్డుబెట్టుకొని నాయనారుపై పోరుకు దిగాడు.

ఏనాదినాథర్ అతిసూరన్‌పై తన ఖడ్గాన్ని ప్రయోగించబోయాడు.

ఆ క్షణమే అతి సూరన్ తన ముఖముపై వుండే కవచాన్ని తొలిగించాడు.

నాయనారుకు అతి సూరన్ ఫాలముపై విభూతిరేఖలు కనిపించాయి నిశ్చేష్టుడయ్యాడు. వెంటనే ఖడ్గాన్ని దించి "అయ్యో ఎంత శివాపరాధము చేయబోయాను ? అతను ఇప్పుడు శివభక్తుడైనాడు. అతనికి హాని చేయరాదు. నన్ను చంపాలన్న అభిలాషను అతిసూరన్ నెరవేర్చుకోనీ" అనుకున్నాడు. అనుకొని ఖడ్గాని పారవేయబోయాడు. కాని దానిని చేతిలోనే వుంచుకొని పారవేయాలి అన్న ఆలోచనను మరల్చుకొని - నేను ఖడ్గాన్ని పారవేస్తే నిరాయుదుడ్ని చంపిన పాపము అతనికి అంటుకుంటుంది. శివభక్తునికి అటువంటి పాపము తగలనీయరాదు అనుకుంటూండగా అతి సూరన్ నాయనారును పొడిచి చంపేశాడు.

నాయనారు ఆత్మాహుతికి , మహాశివభక్తితత్పరతకు, శివభక్తుల యెడ గౌరవము అభినివేశము చూచి పరమేశ్వరుడు చలించిపోయాడు. ఎనాది నాథుని యెదుట ప్రత్యక్షమయి, అతనిని తనలోకానికి తీసికొని వెళ్లాడు.

****

భస్మధారణ మహిమ ఇంతింతయని చెప్పలేము. శైవభక్తుల ఫాలమున మూడు విభూతి రేఖలను చూస్తాము. ముముక్షువులకు భవబంధాలు, త్రయీతత్త్వాల నుండి విముక్తి కలిగిస్తున్నట్లు, కలుగజేయుటకు ఉత్తేజము ఉత్సాహము నొసగు రేఖలవి. వాటికి ప్రతీకలు.

త్రయీతత్త్వాలు : 1. మలత్రయము : ఆనవము ('I'ness) కర్మ (selfish activity) మాయ (illusion)

2. ఈషణత్రయము: ధనేషణ, దారేషణ, పుత్రేషణ

3. వాసనత్రయము: లోకవాసన (worldliness)

దేహవాసన (attachment to the body)

శాస్త్రవాసన (blind faith in the scriptures and polemics)

4. శరీరత్రయము: స్థూల సూక్ష్మ కారణ శరీరములు

5. త్రయావస్థలు: జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్తి అవస్థ .